సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 5 । మార్చి । 2025



స్టీల్‌ప్లాంట్‌లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం 8లో



మరణించినా మరొకరికి కంటి వెలుగై.. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ	గురు
6.08	4.57

న్యూస్‌రీల్

కొలంబో చేరుకున్న ఐఎన్‌ఎస్ కుతార్



భారత బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీలంక ప్రతినిధులు

సింధియా : హిందూ మహా సముద్రంపై శ్రీలంక, భారత్‌ల సముద్ర సంబంధాలను బలోపేతం చేసే దిశగా.. తూర్పు నావికాదళానికి చెందిన ఈస్టర్న్ ఫ్లీట్ షిప్ ఐఎన్‌ఎస్ కుతార్ కొలంబో చేరుకున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. దీంతో ఓడ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ నితిన్ శర్మ.. శ్రీలంక నేవీ వెస్టర్న్ నేవల్ ఏరియా కమాండర్ రియర్ అడ్మిరల్ ఎంహెచ్‌సీజె శిల్వా నుంచి స్వాగతం అందుకున్నారు. అనంతరం ఇరుదేశాల నావికాదళాల మధ్య వృత్తిపరమైన, ఉమ్మడి కార్యాకలాపాలపై కార్యచరణను రూపొందించడంతోపాటు రెండు దేశాల మధ్య దీర్ఘకాల భాగస్వామ్యంపై చర్చించినట్లు నేవీ అధికారులు తెలిపారు.

సర్వేలు వేగవంతం

కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ, వార్డు సచివాలయాల కీలక కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మిస్సింగ్ హౌస్ హోల్డ్ డేటా, ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్ ఫ్రం హోమ్, హౌస్ ఇమేజ్, జియో కో-ఆర్డినేట్లు, తోలు కళాకారుల సర్వేలపై కలెక్టర్ సమీక్ష చేశారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వే ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో సర్వేను ధ్రువీకరించాలని ఆదేశించారు. సమావేశానికి డీఎల్డీవో ఉషారాణి, జోనల్ కమిషనర్లు హాజరయ్యారు. వర్చువల్‌గా ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఈడీగా సమీర్‌శర్మ



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా సంస్థ జీజీఎం సమీర్‌శర్మ నియమితులయ్యారు. సమీర్‌శర్మ తన విస్తృత అనుభవంతో సంస్థలో కార్యాచరణ నైపుణ్యం, వ్యూహాత్మక వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషించినందున ఈ గౌరవం దక్కింది. ముమ్మందు సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి ఆయన నియామకం మరింతగా దోహదపడుతుందని సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

డిసెంబర్లోనే హెచ్చరించాం..

బీచ్‌రోడ్డు: గత ఏడాది డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో రుషికొండ బీచ్‌ను సందర్శించినపుడే బీచ్ పరిశుభ్రతపై పర్యాటక అధికారులను హెచ్చరించినట్లు ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయినప్పటికీ పర్యాటక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పరిశుభ్రతను పట్టించుకోకపోవడం వల్లే బ్లూ ఫ్లాగ్ అర్హతను కోల్పోయినట్లు పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే ఏపీ టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌తో సమీక్షించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరెవరూ నిర్లక్ష్యం వహించరాదనే అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రుషికొండ ప్రాముఖ్యతను కాపాడుతూ మళ్లీ బ్లూ ఫ్లాగ్ అర్హత సాధించేందుకు తీరాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు.

రుషికొండ బీచ్‌లో సేఫ్టీ రిస్క్ మేనేజ్‌మెంట్ బృందం



లైఫ్ గార్డ్స్‌తో మేనేజ్‌మెంట్ బృందం

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌ను మంగళవారం సాయంత్రం పూణేకు చెందిన సేఫ్టీ రిస్క్ మేనేజ్‌మెంట్ బృందం సందర్శించింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ అలల ప్రమాదంలో చిక్కుకున్న పర్యాటకులను ఏ విధంగా కాపాడుతున్నారో, ఫస్ట్ ఎయిడ్ ఎలా చేస్తున్నారో పరిశీలించారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. వీరి వెంట ఆర్డీ జి.జగదీష్, మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానా కల్లాస్!



అమరావతికి జీవీఎంసీ నిధులు
అకౌంటులో ఉన్నది రూ.50 లక్షలే..

- జీవీఎంసీ ఆదాయాన్ని మళ్లించుకుంటున్న ప్రభుత్వం
- సీఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా రాష్ట్ర ఖజానాకు చేరుతున్న వైనం
- గత 9 నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిల్
- బిల్లుల కోసం 10 శాతం పర్సంటేజీ వసూలు
- కొద్దిపాటి ఖజానాలోనూ దండుకుంటున్న కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఒకప్పుడు కాసుల గలగలలతో నిండుగా ఉండే జీవీఎంసీ ఖజానా నిధులు లేక విలవిలలాడుతోంది. ఈ ఖజానాపై కన్నేసిన కూటమి ప్రభుత్వం నేరుగా సెంట్రలైజ్డ్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎఫ్ఎంఎస్) ద్వారా అమరావతికి తరలించేస్తోంది. ఈ నిధులను అమరావతిలో వివిధ పనుల కోసం వినియోగించేందుకే జమ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇక్కడి కాంట్రాక్టర్లకు తొమ్మిది నెలల నుంచి బిల్లులు చెల్లించేందుకు నిధులు లేకుండా పోయాయి. పైగా కొద్ది రోజుల క్రితం జీవీఎంసీ ఖజానాలో ఉన్న నిధులు రూ.50 లక్షలకు పడిపోయినట్టు తెలుస్తోంది. వాస్తవానికి మొన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా జీవీఎంసీకి కేటాయించలేదు. పైగా ఇప్పుడు జీవీఎంసీ ఖజానాకే కన్నం పెట్టి అమరావతికి నిధులు తరలించుకుపోతుండడంపై ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక్కడి ప్రజలు కట్టిన పన్నులతో ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా రాష్ట్ర ఖజానాకు తరలించుకుపోవడంపై బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరోవైపు ఉన్న కొద్దిపాటి నిధులనూ తమకు పర్సంటేజీలు ఇచ్చిన కాంట్రాక్టర్లకు బిల్లులు చేసేలా కార్పొరేషన్‌లో అన్నీ తామై వ్యవహరిస్తున్న నలుగురి సభ్యుల కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేరుకే భారీ బడ్జెట్..!

జీవీఎంసీ ఏటా రూ.5 వేల కోట్లకుపైగా అంచనాలతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఇందులో రూ.1,200 కోట్ల మేర ఇంజనీరింగ్ పనులకే ఖర్చు చేస్తుంది. మంచినీటి సరఫరా కోసం రూ.340 కోట్లు, పబ్లిక్ హెల్త్ కోసం రూ.450 కోట్లు, వివిధ ప్రాజెక్టుల అమలు కోసం రూ.800 కోట్ల మేర వెచ్చిస్తోంది. ఇక అమృత్ పథకం అమలు కోసం రూ.310 కోట్ల మేర వినియోగిస్తోంది. ఇవి కాకుండా లైటింగ్, యూసీడీ, పార్కులు, విద్య తదితర పద్దుల కోసం మిగిలిన మొత్తాన్ని వెచ్చిస్తోంది. అయితే గత 9 నెలలుగా ఇంజనీరింగ్ పనులతో పాటు వివిధ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. ప్రజల నుంచి పన్నుల ద్వారా వస్తున్న ప్రధాన ఆదాయాన్ని ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ఖాతాల ద్వారా జమ చేసుకుంటోంది. దీంతో జీవీఎంసీ ఖజానాకు కన్నంపడుతోంది.

నేరుగా రాష్ట్ర ఖజానాలోకే...!

జీవీఎంసీకి ప్రధానంగా ప్రజల నుంచి వసూలు చేసే పన్నులతో పాటు వీఎల్‌టీ, టౌన్ ప్లానింగ్ ద్వారా వచ్చే ఆదాయ వనరులు ప్రధానమైనవి. వివిధ వాణిజ్య సంస్థలు, విశాఖ పోర్టు, స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థల నుంచి వచ్చే ఆదాయం కూడా ఎక్కువే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఇలా వచ్చే మొత్తాన్ని జీవీఎంసీ తన సొంత ఖాతాలోకి జమ చేసుకునేది. తద్వారా జీవీఎంసీ ఖజానాలో నిధులు గలగలలాడేవి. దీంతో అప్పటికే భారీగా పేరుకుపోయిన కాంట్రాక్టర్ల బిల్లులను కూడా గత ప్రభుత్వ హయాంలో చెల్లించారు. కరోనా సమయంతో పాటు ఆ తర్వాత కొద్ది నెలలు మాత్రమే ఇబ్బందులు మినహా... మిగిలిన సమయం అంతా కాంట్రాక్టర్లకు బిల్లులను సకాలంలో చెల్లించేవారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడంతోపాటు బిల్లులను ప్రాసెస్ సమయం కూడా కలుపుకుంటే.. 5 లేదా 6 నెలల్లోనే బిల్లులను చెల్లించేవారు. తద్వారా కాంట్రాక్టర్లు చాలా తక్కువ ధరకే టెండర్లను దాఖలు చేసేవారు. ప్రధానంగా సింహాచలం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు నగరంలోని వివిధ రోడ్ల పనులకు ఏకంగా 30 శాతానికి మించి తక్కువ ధరను కోట్ చేసి.. టెండర్లను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంటోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో పనులు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ టెండర్లను దాఖలు చేస్తే.. అధిక ధరకు బిడ్ చేస్తున్నారు. తద్వారా జీవీఎంసీ ఖజానాపై అధిక భారం పడుతోంది.

బిల్లులు.. పర్సంటేజీ రాజాలు..!



జీవీఎంసీలో ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, పార్కుల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు జీవీఎంసీ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీవీఎంసీ ఆదాయం కాస్తా సీఎఫ్ఎంఎస్‌కు చేరుతుండటంతో.. బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వంలోని కొద్ది మంది నేతలు ఇదే అదునుగా బిల్లుల కోసం వసూలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. జీవీఎంసీ ఖజానాలో ఉన్న కొద్ది పాటి మొత్తాన్ని కూడా తాము చెప్పిన వారికి బిల్లులు చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకోసం ఏకంగా 10 శాతం కమీషన్ దండుకుంటున్నట్టు విమర్శలున్నాయి. ప్రధానంగా రాబోయే కాలంలో తమదే అధికారం అని చెప్పుకుంటూ ఇప్పటికే స్టాండింగ్ కమిటీల ద్వారా 10 శాతం వసూలు చేస్తున్న నలుగురు సభ్యుల కూటమి నేతలు.. ఇప్పుడు బిల్లులకూ వసూలు మొదలుపెట్టారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కొద్ది మంది కాంట్రాక్టర్లు కూటమి నేతలకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.

మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీపై చర్యలు?

- గతంలో మహిళా సీఐ ఫిర్యాదు
- తాజాగా మహిళా ఏఎస్ఐ కూడా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు
- ఉన్నతాధికారుల దృష్టికి ఏసీపీ వ్యవహారం

విశాఖ సిటీ : మహిళలపై వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే పోలీస్‌స్టేషన్ మహిళా సిబ్బందే.. తమ పై అధికారి వేధింపులు భరించలేకపోతున్నామని వరుస ఫిర్యాదులు చేస్తుండడం విశాఖ పోలీస్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో ఒక మహిళా సీఐ, తాజాగా ఒక మహిళా ఏఎస్ఐ సంబంధిత ఏసీపీపైనే ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమవుతోంది. మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ పెంటారావు పరుషంగా మాట్లాడడంతో పాటు ఇష్టానుసారంగా విధులు కేటాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై ఏఎస్ఐ నేరుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. గతంలో ఒక మహిళా సీఐ కూడా ఏసీపీ వ్యవహార శైలి, మాటతీరుపై సీపీకి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో కూడా సీపీ అతనిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. తాజా ఫిర్యాదుపై కూడా విచారణ చేయించి నివేదికను డీజీ కార్యాలయానికి పంపించినట్లు తెలిసింది. వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు కూడా ఏసీపీ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు పోలీస్ శాఖలో టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఏసీపీపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల కోడ్ ఎత్తి వేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇక మీదట అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. 27న పోలింగ్, ఈ నెల 3న ఓట్ల లెక్కింపు పూర్తయింది. పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్సీ ఫలితం కూటమికి చెంపపెట్టు

- కూటమి దుష్టపాలనకు టీచర్లు గట్టిగా బుద్ధి చెప్పారు
- గాదె శ్రీనివాసులునాయుడు గెలవడంతో ప్లేటు ఫిరాయించారు
- ఎవరికో పుట్టిన బిడ్డకు మీరు పేరు పెట్టుకోవద్దు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చిత్రంలో దేవన్‌రెడ్డి, రవిరెడ్డి, మొల్లి అప్పారావు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం చెంపపెట్టులాంటిదని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉత్తరాంధ్రపై చూపుతున్న వివక్షకు నిరసనగా టీచర్లు గట్టి షాకిచ్చారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థి రఘువర్మ ఘోర పరాజయం తర్వాత ఉత్తరాంధ్రకు చెందిన టీడీపీ నాయకులు మాట మార్చారని మండిపడ్డారు. గెలిచిన గాదె శ్రీనివాసులునాయుడు తమ అభ్యర్థే అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశాలు నిర్వహించారని, తన ఎక్స్ ఖాతాలో రఘువర్మకు టీడీపీ శ్రేణులు ఓటెయ్యాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆయనతోపాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజులాంటి సీనియర్ నాయకులు బహిరంగంగానే పిలుపునిచ్చారని పేర్కొన్నారు. వీటితో పాటు రఘువర్మను గెలిపించాలని టీడీపీ నాయకుల పేరుతో పత్రికా ప్రకటనలు కూడా వచ్చాయన్నారు. జనసేన పార్టీ సైతం తన అధికారిక ఖాతాలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా రఘువర్మను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. గాదె శ్రీనివాసులునాయుడుకి మద్దతు ఇచ్చినట్టు కూటమి నాయకులు ఒక్క ఆధారమైనా చూపించగలరా? అని ప్రశ్నించారు. ఎవరికో పుట్టిన బిడ్డకు మీ పేరు పెట్టుకోవద్దంటూ ఎద్దేవా చేశారు.

ఇది ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వం

9 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వచ్చిన వ్యతిరేకతకి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఉద్యోగుల్లో దాదాపు 35 శాతంగా ఉన్న టీచర్లు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ వైఫల్యం బయటపడిందన్నారు. విద్యాశాఖను నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్ టీచర్ల సమస్యలు తీర్చడంలో విఫలం కావడంతోనే వారు ప్రభుత్వానికి గట్టిగా షాకిచ్చారని తెలిపారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయలేదు.. ఐఆర్ ఇవ్వలేదు.. మూడు డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి, ఉద్యోగుల పింఛన్ విధానంపై ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. ఉద్యోగులకు ఈ ప్రభుత్వం రూ.26 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. స్వయాన సీఎం చంద్రబాబు కుమారుడు లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖలోనే ఓటమి అంటే.. లోకేష్ అసమర్థ పాలనగానే చెప్పుకోవచ్చన్నారు.

కూటమి పాలనలో ఉత్తరాంధ్రపై వివక్ష

కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వివక్ష చూపుతోందని, అమరావతి అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించి, విశాఖకు రూపాయి కూడా కేటాయించలేదన్నారు. రుషికొండ బీచ్‌కి తమ హయాంలో 2020లో బ్లూఫ్లాగ్ హోదా వస్తే, కూటమి ప్రభుత్వంలో నిర్వహణ సరిగా లేక ఆ హోదా పోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో దూసుకెళ్లిందన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, నర్సీపట్నం, పాడేరు, విజయనగరంలో మెడికల్ కాలేజీలు, ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్.. ఇవన్నీ తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులేనన్నారు. ఇప్పటికైనా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, ముఖ్యనాయకులు మొల్లి అప్పారావు, గండి రవికుమార్, జిల్లా అనుబంధ విభాగ, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు అడగొద్దు

- ఈ నెలలో కూడా ఎగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు




మహారాణిపేట: కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) అస్తవ్యస్తంగా మారింది. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం కార్డుదారులకు అందించే కందిపప్పునకు ఈ నెల కూడా ఎగనామం పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీడీఎస్ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరకుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కేవలం బియ్యం, పంచదార మినహా మిగిలిన సరుకుల సరఫరా నోచుకోవడం లేదు. కందిపప్పు సరఫరా కూడా రెండు నెలల ముచ్చటగానే ముగిసింది. ఆ తర్వాత నుంచి కందిపప్పు జాడలేదు. ఈ నెల కూడా కంది పప్పును మాత్రం అడగొద్దని అంటున్నారు. కొన్ని నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోగా మార్చిలోనైనా ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఈ నెలలో కూడా పంపిణీ చేయలేమని కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నాయకులు బియ్యం కార్డుదారులకు వరాల జల్లు కురిపించారు. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, నూనె, గోధుమ పిండి, రాగి పిండి తదితర సరుకులు అందజేస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై కనీసం దృష్టి సారించలేదు.

చుక్కలు చూపిస్తున్న కందిపప్పు ధర

జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులు ఉన్నాయి. వీరి కోసం 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. దీని ప్రకారం జిల్లాలోని కార్డుదారుల అవసరాలకు అనుగుణంగా 700 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. అయితే గతేడాదిలో రెండు నెలలు మాత్రమే కందిపప్పులు సరఫరా చేశారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు కందిపప్పును రూ.67కు అందించేవారు. కొంత కాలంగా ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం, బహిరంగ మార్కెట్లో కేజీ ధర రూ.160 వరకు పలుకుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు కందిపప్పు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో పప్పన్నానికి దూరం అవుతున్నారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

ఐపీఎల్‌కు సరికొత్తగా వైఎస్సార్ స్టేడియం




ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ బృందం

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం కొత్తరూపు సంతరించుకుంటోంది. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి మంగళవారం జిల్లా యంత్రాగం సమావేశమైంది. ముందుగా ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్‌తో పాటు కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, మ్యాచ్ నిర్వాహక కమిటీ స్టేడియంను సందర్శించింది. స్టేడియంలో ఆధునికీకరణ పనులు పర్యవేక్షించిన అనంతరం.. ఫ్లడ్‌లైట్ల పనితీరును పరిశీలించింది. ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా స్టేడియం, స్టేడియం బయట ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? ప్రవేశ మార్గాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ కాసేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. కాగా.. ఈ నెల 24న రాత్రి 7గంటలకు లక్నో సూపర్‌జెయింట్‌తో, 30న మధ్యాహ్నం 3 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.


రూ.40 కోట్లతో స్టేడియం ఆధునికీకరణ

సాంకేతికతను అనుసంధానిస్తూ విశాఖలోని వైఎస్సార్ స్టేడియంను ఆధునికీకరిస్తున్నట్లు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తెలిపారు. సీపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ క్యాపిటల్స్ సూచనల మేరకు స్టేడియంలో బాత్‌రూమ్‌లను పెంచి అభిమానులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. దాదాపు 40 కోట్ల వరకు వెచ్చించామన్నారు. ఫ్లడ్‌లైట్ల కోసం రూ.9.5 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. 34 వీఐపీ కార్పొరేట్ బాక్స్‌లతో పాటు రెండు టీమ్ బాక్స్‌లను సరికొత్తగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీంతో బీసీసీఐ సైతం ఈ ఏడాది మరిన్ని మ్యాచ్‌లను విశాఖ వేదికగా నిర్వహించేందుకు మాటిచ్చిందన్నారు. ప్రతి జిల్లాలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సీపీ మాట్లాడుతూ మరోసారి విశాఖ వేదికగా ఐపీఎల్ జరగడం శుభపరిణామన్నారు. ఆటగాళ్ల నుంచి అభిమానుల భద్రత వరకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాట్లు చేస్తామన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

పోక్సో కోర్టు పీపీగా రాజశేఖర్



విశాఖ లీగల్ : నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వతేజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో సీనియర్ న్యాయవాదిగా ఉన్న రాజశేఖర్ పలు క్రిమినల్, సివిల్ కేసుల్లో మంచి ప్రతిభ చూపించారు. రాజశేఖర్ 2001లో నగరంలో ఎన్‌బీఎం లా కాలేజీ నుంచి న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత బార్ కౌన్సిల్ ద్వారా న్యాయవాదిగా నమోదయ్యారు. పలు పబ్లిక్, ప్రైవేటు రంగ సంస్థలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2018 నుంచి మూడేళ్ల పాటు జిల్లా పరిషత్ న్యాయ సలహాదారుడిగా వ్యవహరించారు. రాజశేఖర్ నియామకం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నర్సింగరావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నేడు నగరానికి ప్రముఖుల రాక

ఢిల్లీ నుంచి సీఎం చంద్రబాబు

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 11.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి రాంనగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో బస చేస్తారు. గురువారం గీతంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి తిరిగి ఢిల్లీ వెళ్తారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం రాత్రి 8.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. గురువారం గీతం విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నోవాటెల్ హోటల్‌లో బడ్జెట్‌పై జరిగే సదస్సుకు హాజరవుతారు. 4 గంటలకు అక్కడే ప్రెస్‌మీట్‌లో పాల్గొంటారు. సాయంత్రం 6.15 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు.

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాత్రి 8.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 6న నగరంలో జరిగే బడ్జెట్‌పై జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 9.25 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు. అలాగే కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి మనోజ్ గోవిల్ రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వస్తున్నారు. 5, 6 తేదీల్లో నగరంలో ఆయన పర్యటిస్తారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి సాగర్ నగర్‌లోని తన ఇంటికి వెళతారు. మధ్యాహ్నం 2.20 గంటలకు రాడిషన్ బ్లూ హోటల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 6న గీతం విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. 7వ తేదీన విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో బెంగళూరు వెళ్తారు.

హోలీకి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: హోలీ పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- చర్లపల్లి-షాలిమర్(07703) హోలీ స్పెషల్ చర్లపల్లిలో ఈ నెల 9, 16వ తేదీల్లో (ఆదివారం) రాత్రి 7.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.02 గంటలకు బయల్దేరి మరుసటిరోజు (మంగళవారం) తెల్లవారు 2 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్-చర్లపల్లి(07704) హోలీ స్పెషల్ ఈ నెల 11, 18వ తేదీల్లో (మంగళవారంలో) ఉదయం 5 గంటలకు షాలిమర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.50 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.52 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.10 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.
- చర్లపల్లి -సంత్రగచ్చి(07705) హోలీ స్పెషల్ ఈ నెల 7, 21వ తేదీల్లో(శుక్రవారం) ఉదయం 7.15 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదేరోజు రాత్రి 7.45గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.47 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి-చర్లపల్లి(07706) హోలీ స్పెషల్ సంత్రగచ్చిలో ఈ నెల 8, 22వ తేదీల్లో (శనివారం) మధ్యాహ్నం 12.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.52 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

నేషనల్ యూత్ పార్లమెంట్‌కు 9 వరకు గడువు

ఏయూక్యాంపస్: నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2025కి విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకోవడానికి ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉంది. mybharat.gov.inను సందర్శించి 'వికసిత్ భారత్ అంటే ఏమిటి' అనే అంశంపై ఒక నిమిషం వీడియోను అప్‌లోడ్ చేయాలి. అదే పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవాలి. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పర్యవేక్షిస్తారు.

నకిలీ పోలీస్ అరెస్ట్


పోలీసు వాకీటాకీ, రైఫిల్‌తో నిందితుడు లోచన్ కుమార్

ఎంవీపీకాలనీ: పోలీసు అధికారినని చెప్పి నగరంలో పలు మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీకాలనీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఈ కేసు వివరాలు వెల్లడించారు. నగరంలోని బాజీ జంక్షన్‌కు చెందిన చెల్లుబోయిన లోచన్‌కుమార్ పోలీసు అధికారినని చెప్పుకుంటూ.. ఫేక్ ఐడీ కార్డులు, పలువురు పోలీసు ఉన్నతాధికారులు, రైఫిల్స్, వాకీటాకీలతో దిగిన ఫొటోలు చూపిస్తూ చాలా కాలంగా మోసాలకు పాల్పడుతున్నాడు. ఆయా మోసాలకు సంబంధించి ఇప్పటికే అతనిపై పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. గతంలో ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఓ చీటింగ్ కేసు, గోపాలపట్నం పోలీసు స్టేషన్‌లో కొట్లాట కేసు నమోదైంది. తాజాగా నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట జరుగుతుందని.. తక్కువ ధరకే వాటిని ఇప్పిస్తానని చెప్పి పలువురు దగ్గర నుంచి వసూళ్లకు పాల్పడ్డాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని మరి కొందరిని మోసం చేశాడు. ఎంవీపీ కాలనీ సెక్టార్-3కి చెందిన బలివాడ రామ్‌సాయి గోపాల్ అనే వ్యక్తి నుంచి రూ.61,900 వసూలు చేశాడు. గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో ఓ వ్యక్తి నుంచి ఇదే తరహాలో రూ.26 వేలు వసూలు చేశాడు. అయితే వాహనాలు ఇప్పించాలని రామ్‌సాయి గోపాల్ ఒత్తిడి చేయడంతో అతని ఫోన్, మేసేజ్‌లకు సమాధానం ఇవ్వకుండా కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో అనుమానం వచ్చిన రామ్‌సాయి గోపాల్ ఇటీవల నగర పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎంవీపీ పోలీసులు లోచన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. 318(4), 319(2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ మూర్తి వెల్లడించారు. లోచన్ కుమార్ 2018 నుంచి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ సమావేశంలో ఎంవీపీ సీఐ మురళీ, ఎస్ఐ ధనుంజయ్ నాయుడు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

'టీసీపీసీ' భూముల పరిశీలన

బక్కన్నపాలెంలో పారా స్టేడియం ప్రతిపాదన

మధురవాడ/ఏయూక్యాంపస్: బక్కన్నపాలెంలోని రాష్ట్ర ప్రభుత్వ వయోవృద్ధులు, వికలాంగుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రం(టీసీపీసీ)కి చెందిన భూములు, దాని పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను మంగళవారం కేంద్ర సామాజిక న్యాయ శాఖ డైరెక్టర్ వినీత్ సింఘాల్, ఏఎస్‌వో రాహుల్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. ఇక్కడ దివ్యాంగుల క్రీడా స్టేడియం నిర్మాణ ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో సర్వే నంబర్ 92లో సుమారు 22 ఎకరాలు, దానికి ఆనుకుని నవోదయ వెనుక, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొమ్మాది ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు పరిశీలించారు. ఇక్కడ ఎంత భూమి అందుబాటులో ఉంది? ఇందులో స్టేడియం నిర్మాణానికి ఎంత అవసరం? అందుకు అనువుగా ఉందా లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మాధవి, తహసీల్దార్ కిరణ్, ప్రిన్సిపాల్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల(ఎండాడ), పెందుర్తిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.


బక్కన్నపాలెంలో భూములకు సంబంధించి మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

భద్రతకు అత్యంత ప్రాధాన్యం

స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె.సక్సేనా పిలుపునిచ్చారు. ఉక్కు మల్టీపర్పస్ హాలులో మంగళవారం రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివ శంకరరెడ్డి, సంస్థ డైరెక్టర్లతో కలిసి జాతీయ భద్రతా దినోత్సవ కార్యక్రమాలు ప్రారంభించారు. ముందుగా సక్సేనా భద్రత ప్రతిజ్ఞ చేసి, అనంతరం మాట్లాడారు. పారిశ్రామిక కార్యకలాపాల్లో భద్రత ప్రాముఖ్యాన్ని చాటి చెప్పారు. భద్రత అనేది కేవలం ఒక తంతు కాదని.. ఉద్యోగుల క్షేమం, సంస్థ భవిష్యత్తు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే సంస్కృతి నుంచి.. ప్రమాదాలు జరగకుండా నివారించే సంస్కృతికి మారాలని ఉద్యోగులకు సూచించారు. శివశంకరరెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో భద్రత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సురక్షితమైన పద్ధతులను పాటించడం వల్ల నష్టాలను తగ్గించవచ్చన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని వివరించారు. పరిశ్రమల్లో, రోడ్లపై, ఇంట్లో భద్రతా నియమాలను పాటిస్తూ తమ ప్రవర్తనను మార్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు భోపాల్ గ్యాస్ దుర్ఘటనపై ప్రదర్శించిన నాటిక అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్లు ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్, ఉన్నతాధికారులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనావాసంలోకి కణుజు

పట్టించుకోని అటవీ శాఖాధికారులు



కొమ్మాది: కంబాల కొండ నుంచి దారి తప్పి ఓ కణుజు జనావాసాల్లోకి వచ్చేసింది. రాత్రి సమయంలో జాతీయ రహదారి దాటుకుని ఎండాడ పోలమాంబ ఆలయ ప్రాంతంలోకి చేరుకుంది. మూడు రోజుల నుంచి ఆహారం, తాగునీరు లేక ఎండ వేడికి తట్టుకోలేక.. జన సంచారానికి భయపడి బిక్కుబిక్కుమంటూ సంచరిస్తోంది. కాగా.. కణుజును తీసుకుని వెళ్లమని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తే.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దళితులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

- ఐపీఎస్ అధికారి సునీల్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి
- వైఎస్సార్ సీపీ దళిత విభాగం నేతల డిమాండ్


మాట్లాడుతున్న బోని శివరామకృష్ణ. చిత్రంలో జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి

సాక్షి, విశాఖపట్నం: దళితులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి మండిపడ్డారు. మాజీ ఎంపీ నందిగం సురేష్, ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై అక్రమంగా కేసులు పెట్టి వేధించిందని, ఇదే కొనసాగితే రాష్ట్రంలోని దళితులంతా ఏకమై కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌పై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బోని శివరామకృష్ణ మాట్లాడారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. అధికారం చేపట్టినప్పటి నుంచి ఎవరిపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేయాలనే ఆలోచన తప్ప.. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే తపన లేదన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఐదేళ్ల కిందటనాటి ఎయిర్‌పోర్టు కేసు అని చెప్పి తనకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. తనలాగే రాష్ట్రంలో అనేక మంది దళితులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇదే కొనసాగితే ఈ ప్రభుత్వం భూస్థాపితం కావడం తథ్యమని హెచ్చరించారు. మంచా మల్లేశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఒక ప్రజాప్రతినిధిని సంతృప్తి చేసేందుకు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముగ్గురూ దళిత ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా ఆయనపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. సునీల్‌కుమార్ ఎప్పుడో తన సొంత ఖర్చుల మీద విదేశాలకు వెళ్తే కూటమి నేతలకు వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో దళిత మహిళలకు రక్షణే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తాను ఒక పోస్టు పెట్టినా, వీడియో పోస్టు చేసినా.. అసభ్యకరంగా కామెంట్లు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇవేమి కూటమి ప్రభుత్వానికి కనిపించవా అని ఆమె ప్రశ్నించారు.

ఈపీడీసీఎల్ లైన్‌మన్‌కు జాతీయ అవార్డు

విశాఖ సిటీ: చింతూరు లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ జాతీయస్థాయిలో ఉత్తమ లైన్‌మన్ అవార్డు సాధించారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన లైన్‌మెన్ దివస్ కార్యక్రమంలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘనశ్యామ్ చేతుల మీదుగా ఉత్తమ లైన్‌మన్ అవార్డును గణేష్ అందుకున్నారని పేర్కొన్నారు. గణేష్‌తో పాటు ఉత్తమ లైన్‌మన్‌గా ప్రశంసలు పొందిన అనకాపల్లి సర్కిల్‌కు చెందిన బి.మాణిక్యాలరావు, పార్వతీపురం సర్కిల్ పి.సింహాచలంకు సీఎండీతో పాటు సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు.

మరణించినా.. మరొకరికి కంటి వెలుగై...

గోపాలపట్నం: మరణించినా మరొకరికి కంటి వెలుగయ్యాడు ఓ యువకుడు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం కప్పరాం గ్రామానికి చెందిన గోకా శివకృష్ణ(34).. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ-బ్లాక్‌లో తల్లిదండ్రులు సోమేష్, దమయంతితో కలిసి ఉంటున్నాడు. క్షణికావేశంలో సోమవారం ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తీరని దుఃఖంలో ఉన్నప్పటికీ, శివకృష్ణ తల్లిదండ్రులు సోమేష్, దమయంతి మానవత్వం చాటుకున్నారు. తమ కుమారుడు మరణించినా, మరొకరికి కంటి వెలుగు నింపాలని నిర్ణయించుకున్నారు. మోసిన్ ఐ బ్యాంక్ నిపుణులు శివకృష్ణ నేత్రాలను సేకరించి, కుటుంబ సభ్యులకు అంగీకార పత్రాన్ని అందజేశారు. యువకుడి కుటుంబ సభ్యులకు డాక్టర్ వాణి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, అంబేడ్కర్


మాట్లాడుతున్న నాగేశ్వరరావు, అంబేడ్కర్

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్‌లు అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై మంగళవారం సంఘం ముఖ్యనాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి చెందడం, వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలు ఎంత దారుణంగా ఉన్నాయో స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు యూటీఎఫ్ సంఘానికి వైఎస్సార్‌సీపీ ముసుగువేస్తూ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని దానికి యూటీఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే యూటీఎఫ్‌కు రాజకీయాలు అంటగట్టడం సరికాదన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలో చూసే కూటమి పార్టీల వారు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా రాజకీయం చేయటం ద్వారా ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు.

కెరీర్ ఫెయిర్‌కు విస్తృత ఏర్పాట్లు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఈ నెల 5, 6 తేదీల్లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా కెరీర్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 33,682 మంది యువత పేర్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ కళాక్షేత్రం వేదికగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల మహిళలకు క్రీడా పోటీలు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా సంఘాలు, ఎన్జీవోలను భాగస్వామ్యం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ రుణాల మంజూరుపై బ్యాంకర్లు దృష్టి సారించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య, పోలీస్, గ్రామీణ పేదరిక నిర్మూలన, విద్యాశాఖ తదితర శాఖలు సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

• చల్లని కర్బూజా... రుచి ఎంతో మజా




వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండలు మండిపోతుండటంతో పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది. మార్కెట్‌లు పుచ్చకాయలతో నిండిపోయాయి. నగరంలోని జ్ఞానాపురం మార్కెట్‌లో ఓ బండిపై అమ్మకానికి ఉంచిన పుచ్చకాయ ముక్కను ఓ చిన్నారి తింటుండగా.. 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• జాతరకు అమ్మవారి ప్రతిమలు సిద్ధం

కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేటలో కొలువైన పైడితల్లి అమ్మవారి జాతర కోసం సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 10న కంచరపాలెం వీధుల్లో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు కనులపండువగా జరగనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 300పైగా అమ్మవారి ప్రతిమలను తయారు చేయిస్తున్నారు. ఆకర్షణీయంగా సిద్ధమవుతున్న ఈ విగ్రహాలు జాతర శోభను మరింత పెంచనున్నాయి. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

తుమ్మపాల : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్ఏఎంపీ పథకం ద్వారా ఉచిత శిక్షణ నిర్వహిస్తామని అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జి. నాగరాజారావు మంగళవారం తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందుటకు ఆర్ఏఎంపీ పథకం ద్వారా వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ ట్రెండ్జ్ ఐటీ వారితో నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనకాపల్లి పట్టణంలోని ట్రెండ్జ్ ఐటీ, 12-46 మాక్స్ షాపింగ్ మాల్ పైన, 3 వ ఫ్లోర్, ఉషా ప్రైమ్ పక్కన, కాంప్లెక్స్ దగ్గర, అలాగే చోడవరం ట్రెండ్జ్ ఐటీ, 5-20, లక్ష్మీపురం రోడ్, వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా గల కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. అనకాపల్లిలో అయితే 95021 66626, 99485 19782, చోడవరంలో 73860 84548, 77998 83952లో సంప్రదించాలన్నారు.. అభ్యర్థులు 18 నుంచి 58 సంవత్సరాలు వయసు కలిగి, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డుతో ఈ నెల 5 నుంచి సంప్రదించాలని సూచించారు.